PRGI NO: TGTEL/25/A2356

# మేకార్తి దినపత్రిక

జర్నలిస్టులకు ఆహ్వానం
నూతనంగా ప్రారంభించిన
మేకార్తి దినపత్రిక పత్రికలో
అన్ని జిల్లాలలో స్టాఫర్లుగా,మండలాల్లో విలేకర్లుగా పనిచేయుటకు
జర్నలిస్టులు కావలెను
సంప్రదించాల్సిన నెంబర్స్
9014726022,6302041083

మంగళవారం DAY 16.09.2025 | కరీంనగర్ KARIMNAGAR | పేజీలు : 4 pages : 4 | సంపుటి :1 ‖ సంచిక :14 ‖ధర : 4.00 | దశమి

మంగళవారం, సూర్యోదయం: 5-45, సూర్యాస్తమయం: 6-44. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం వసంత రుతువు వైశాఖ మాసం కృష్ణ పక్షం తిథి: దశమి రాత్రి 12-36 వరకు. నక్షత్రం: విశాఖ ఉదయం 9-09 వరకు, తదుపరి అనురాధ, వర్జ్యం: పగలు 1-34 నుంచి పగలు 3-20 వరకు, రాహుకాలం: పగలు 3-25 నుంచి సాయంత్రం 5-02 వరకు.దుర్ముహూర్తం: ఉదయం 8-20 నుంచి ఉదయం 9-12 వరకు, పునర్ దుర్ము హూర్తం: రాత్రి 11-05 నుంచి రాత్రి 11-50 వరకు.అమృతకాలం: రాత్రి 12-14 నుంచి రాత్రి 2-01 వరకు.

CIRCULATED AT : WARANGAL , HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA ,ADILABAD, NIZAMABAD, RANGAREDDY, MAHABUBNAGAR, MEDAK

WWW.MEKARTHI DINAPATRIKA.COM

## ఓటర్లతో ముచ్చట పెట్టి

## అమలు కానీ హామీలు



**మేకార్తి దినపత్రిక హైదరాబాద్,సెప్టెంబర్ :**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని ఆ నియోజ కవర్గంలోని కేడర్‌కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. సోమవారం తెలంగాణ భవన్‌లో సదరు నియోజకవర్గంలోని వెంగళరావు నగర్ సిగ్మంట్‌కు చెందిన పార్టీ కేడర్‌తో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ ఎన్నికల్లో పార్టీ విజయం సాధించాలంటూ వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓటర్లతో ముచ్చట పెట్టి. అమలు కానీ కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను వారికి గుర్తు చేయాలని సూచించారు.
అలాగే కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని సైతం ఓటర్లకు వివరించాలని స్పష్టం చేశారు. గతంలో పీజేఆర్, కేసీఆర్, గోపినాథ్ కొట్లాడినట్లు ఉప ఎన్నికల్లో కొట్లాడాలంటూ బీఆర్ఎస్ క్యాడర్‌కు స్పష్టం చేశారు. భయపడితే నాయకులు కాలేరని వారికి సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తనపై ఎన్నో కేసులు పెట్టిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు.
కేటీఆర్ అరెస్ట్ అవుతారంటూ కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేస్తోందని.. అందుకు తాను భయపడడం లేదని కుండ బద్దలు కొట్టారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే మీ ఇళ్లు కూల్చడానికి మీరే లైసెన్స్ ఇచ్చినట్లు అవుతుందని హెచ్చరించారు. హైడ్రా పేరు మీద సీఎం రేవంత్ రెడ్డి కొన్ని వేల ఇళ్లు కూలగొ ట్టారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు వ్యతిరేకంగా పని చేయటమే ఇందిరమ్మ రాజ్యమా? అంటూ సీఎం రేవంత్ రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని వెంగళరావు నగర్ సెగ్మెంట్‌లో బీఆర్ఎస్ పార్టీలో పంచాయితీలు ఉన్న మాట వాస్తవమని ఆయన అంగీకరించారు. అవన్నీ మైక్ ముందు చెబితే బాగుండదన్నారు. ప్రతి ఇంటిలో పంచాయితీ ఉంటుందని.. అలానే వెంగళరావు నగర్ బీఆర్ఎస్ పార్టీలో సైతం ఉందన్నారు. మనం బయటపడి కొట్లాడుకుంటే.. కాంగ్రెస్, బీజేపీ రెడీగా ఉన్నాయని.. జాగ్రత్త అంటూ బీఆర్ఎస్ కేడర్‌ను ఈ సందర్భంగా కేటీఆర్ అప్రమత్తం చేశారు. పంచాయితీ పెద్దగా తనను పెడితే తనతో కాదని స్పష్టం చేశారు. ఏమైనా ఉంటే మీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, సుధీర్ రెడ్డి సమక్షంలో ఆయా ఇబ్బందులను సరి చేసుకోవాలంటూ కేడర్‌కు సూచించారు. ఎన్నికల హామీలు అమలు చేయమంటే తనను కోసుకుని తినమంటూ సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారంటూ గుర్తు చేశారు.
రేవంత్ రెడ్డి లాంటి ముఖ్యమంత్రిని తాను గతంలో ఎప్పుడూ చూడలేదని ఎద్దేవా చేశారు. ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ నేతలు కన్పించరంటూ జోస్యం చెప్పారు. పేదలకు గులాబీ జెండానే దిక్కు అంటూ వారికి గుర్తు చేశారు. కేసులకు భయపడొద్దు కార్యకర్తలను కాపాడుకుంటామంటూ బీఆర్ఎస్ క్యాడర్‌కు ఈ సందర్భంగా కేటీఆర్ భరోసా ఇచ్చారు.

## కాలేజీలు బంద్ సీఎం అత్యవసర సమావేశం

**మేకార్తి దినపత్రిక హైదరాబాద్, సెప్టెంబర్:**
తెలంగాణ ప్రభుత్వం ఫీజు రియింబర్స్‌మెంట్ నగదు చెల్లించకపోవడంతో ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల యాజమాన్యం నేటి నుంచి బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతోపాటు ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.
మరోవైపు.. ఆదివారం కాలేజీ ఫెడరేషన్ ప్రతినిధులతో మంత్రులు భట్టి, శ్రీధర్ బాబు చర్చలు జరిపారు. ఈ చర్చలకు సంబంధించిన వివరాలను ఈ సందర్భంగా సీఎం దృష్టికి వారు తీసుకెళ్లారు. అలాగే వారు తమ ముందు ఉంచిన డిమాండ్లను సైతం సీఎంకు మంత్రులు తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఈ సమావేశానంతరం ఈ అంశంపై ప్రభుత్వం కీలక ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.
ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య కార్యవర్గం ఇటీవల సమావేశమైంది. ఈ సమావేశం అనంతరం ఈ సమాఖ్య నేతలు మీడియాతో మాట్లాడుతూ.. దాదాపు రూ. 8వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉందన్నారు. తక్షణమే ఈ బకాయి నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలా కాకుంటే విద్యా రంగం తీవ్రంగా దెబ్బ తింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలల నిర్వహణ క్లిష్టంగా మారిందని ఈ సందర్భంగా వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ఇదే అంశంపై.. ఇప్పటికే ఉన్నత విద్యా మండలి చైర్మన్‌ను కలిసి మెమోరాండం సైతం అందజేశామన్నారు. కానీ తెలంగాణ ప్రభుత్వం స్పందించకపోవడంతో ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య కాలేజీలు బంద్ చేయాలని నిర్ణయించాయి. అదీకాక.. కాలేజీలు ఇలా బంద్ చేయడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుంద ంటూ ఇప్పటికే తల్లిదండ్రులు, మేధావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. అలాంటి వేళ.. సీఎం రేవంత్ రెడ్డి వారితో చర్చలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది.




## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బరిలో

## కవిత పార్టీ అభ్యర్థి..?



**మేకార్తి దినపత్రిక హైదరాబాద్, సెప్టెంబరు:**
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఈ క్రమంలో ఈ ఎన్నికలకు సంబంధించిన కార్యాచరణను రూపొందిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇందుకోసం కీలక నేతలతో కూడా కవిత సమావేశం అవుతున్నట్లు తెలుస్తోంది. తన ప్లాన్‌లో భాగంగానే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బరిలో తెలంగాణ జాగృతి పార్టీ నుంచి ఓ అభ్యర్థిని బరిలోకి దింపాలని కవిత యోచిస్తున్నట్లు సమాచారం.
ఈ నేపథ్యంలో కవితతో జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే పి. విష్ణువర్ధన్ రెడ్డి ఇవాళ(సోమవారం) ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. వీరి భేటీలో పలు కీలక అంశాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. అరగంటకు పైగా మంతనాలు సాగినట్లు సమాచారం. ఇందులో భాగంగానే ఉప ఎన్నికలో విష్ణువర్ధన్ రెడ్డిని పోటీకి దించే యోచనలో కవిత ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.
వేడుకలకు ఆహ్వానం..
కాగా, కవితను కలిసిన అనంతరం విష్ణువర్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి దసరా వేడుకలకు మాత్రమే కవితను ఆహ్వానించానని క్లారిటీ ఇచ్చారు. ఈ వేడుకలకు హాజరు కావాలని ఆమెకు ఆహ్వాన పత్రికను అందజేశానని విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. అలాగే, ఈ ఏడాది బతుకమ్మ సంబరాల సందర్భంగా కవిత తన పార్టీ పేరును ప్రకటించే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది.

## టెండర్స్ పిలవండి

### అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు



**మేకార్తి దినపత్రిక హైదరాబాద్, సెప్టెంబరు :**
వీధిదీపాల నిర్వహణ కోసం పెద్ద కంపెనీల నుంచి వెంటనే టెండర్స్ పిలవాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఇవాళ(సోమవారం) బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మున్సిపల్, పంచాయతీ రాజ్, జీహెచ్ఎంసీ అధికారులతో సీఎం రేవత్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు సీఎం రేవంత్ రెడ్డి.వీధి దీపాలకు సోలార్ పవర్‌ను వినియోగించడంపైన సాధ్యా సాధ్యాలను పరిశీలించాలని సూచించారు. ఐఐటీ లాంటి సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని మార్గనిర్దేశం చేశారు. రాష్ట్రంలోని అన్ని వీధిదీపాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అను సంధానం చేయాలని ఆదేశించా రు. ఏఐతో ఎప్పటికప్పుడు విశ్లేషణ చేయాలని సూచించారు. గ్రామాల్లో వీధిదీపాల నిర్వహణను గ్రామ పంచాయతీకి అప్పగించాలని మార్గని ర్దేశం చేశారు. వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ అధికారం సర్పంచ్‌లకే అప్పగించాలని ఎంపీడీఓ స్థాయిలో పర్యవేక్ష ణ చేయాలని,అలాగే ప్రతి పోల్ సర్వే చేయించాలని ముఖ్యమం త్రి రేవం త్‌రెడ్డి నిర్దేశించారు.ఈ సమావేశానికి సీఎం సలహాదారు వేం నరేంద ర్‌రెడ్డి,సీఎంఓముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవి, కోర్ అర్బన్ ఏరియా మున్సిపల్ సెక్రటరీ ఇలంబ ర్తి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## కాంగ్రెస్ కమీషన్ల సర్కారంటూ కవిత మళ్లీ ఫైర్



**మేకార్తి దినపత్రిక హైదరాబాద్, సెప్టెంబర్ :**
ఆడబిడ్డల చదువుల విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఆడబిడ్డల చదువులను ఈ కాంగ్రెస్ కమీషన్ల సర్కారు కాలరాస్తోంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంలో ఉద్దేశపూర్వకంగానే ఫీ రీయింబర్స్‌మెంట్ బకాయిలను రేవంత్ ప్రభుత్వం ఎగవేస్తుందని ఆమె ఆరోపించారు.
20 శాతం కమీషన్లు ఇస్తేనే రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇస్తామని ప్రభుత్వంలోని కొందరు డిమాండ్ చేస్తున్నారంటూ కాలేజీల యాజమాన్యాలు ఆవేదన చెందుతోన్నాయని వివరించారు. కమీషన్ల కోసమే బకాయిలు ఏళ్లకేళ్లుగా పెండింగ్‌లో ఉంచుతున్నారని మండిపడ్డారు.
ఇప్పటికే కాలేజీలు నడప లేక ఆర్థికంగా యాజమాన్యాలు చితికిపోయ్యాయని ఎమ్మెల్సీ కవిత ఆందోళన వ్యక్తం చేశారు. కాలేజీలు మూతపడితే చదువుకు ఆడబిడ్డలు దూరం అవుతారని కవిత పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం తన ఎక్స్ ఖాతా వేదికగా కల్వకుంట్ల కవిత స్పందించారు.
మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి భారీగా జరిగిందంటూ రేవంత్ సర్కార్‌కు అందిన నివేదికలు స్పష్టమయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ అవినీతిలో బీఆర్ఎస్ అధినేత, తన తండ్రి కేసీఆర్ ప్రమేయం లేదని కవిత మీడియా ద్వారా స్పష్టం చేశారు. అంతేకాకుండా.. ఈ అవినీతి చేసింది హరీశ్ రావుతోపాటు సంతోష్ రావు అంటూ ఆమె కీలక ఆరోపణలు చేశారు.
ఈ నేపథ్యలో ఆ పార్టీ అగ్రనేత కేసీఆర్.. కవితపై సస్పెన్షన్ వేటు వేశారు. దాంతో ఆమె ఆ పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటున్నారు. ఆమె కొత్త పార్టీ స్థాపించి.. తద్వారా ప్రజల్లోకి వెళ్తారంటూ ఒక ప్రచారం అయితే సాగుతోంది. అదీకాక.. ఇటీవల కాలంలో ఆమె ప్రజా సమస్యలపై తనదైన శైలిలో గళం విప్పుతున్నారు. అందులోభాగంగా ధర్నా చౌక్‌లో ఆందోళనలు నిర్వహిస్తున్నారు.

## మంగర్ బస్తీ ఘటనపై హైడ్రా కమిషనర్



**మేకార్తి దినపత్రిక హైదరాబాద్, సెప్టెంబరు :**
మాసబ్‌ట్యాంక్ మంగర్ బస్తీ నాలాలో భారీ వర్షానికి వచ్చిన వరద నీటిలో మామ అల్లుళ్లు రాము, అర్జున్ అనే ఇద్దరు వ్యక్తులు గల్లంతయ్యారు. నిన్న(ఆదివారం) రాత్రి 8 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. అయితే, మంగర్ బస్తీలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ (%ఎఎతీఖ జశీఎఎఱంంఱశీఅవతీ ఝఅస్త్రుఅఖ్ష్ర%), హైదరాబాద్ కలెక్టర్ హరిచందన ఇవాళ(సోమవారం) పర్యటించారు. ఇద్దరు వ్యక్తులు గల్లంతవడంపై అధికారుల నుంచి రంగనాథ్, కలెక్టర్ హరిచందన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రంగనాథ్ మీడియాతో మాట్లాడారు.

## బీఆర్ఎస్, కాంగ్రెస్‌లపై

## బండి సంజయ్ షాకింగ్ కామెంట్స్

**మేకార్తి దినపత్రిక మంచిర్యాల, సెప్టెంబరు:**
ప్రధానమంత్రి నరేంద్రమోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఉద్యోగ, ఉపాధి అవకాశాలను ఎక్కువగా పెంచారని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఉద్ఘాటించారు.మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సేవా భారతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను బండి సంజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ ప్రసంగించారు. ప్రతి ఏడాది మోదీ ప్రభుత్వం 10 లక్షల ఉద్యోగాలు ఇస్తోందని నొక్కిచెప్పారు. ప్రతి ఏడాది ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తోందని గుర్తుచేశారు బండి సంజయ్. మోదీ ప్రభుత్వంలో ఎక్కడా పేపర్ లీక్ కాలేదని...



ఎక్కడా ఉద్యోగాలు అమ్ముకోలేదని స్పష్టం చేశారు. నిరుద్యోగులకు బీజేపీ ప్రభుత్వం అండగా ఉంటుందని మాటిచ్చారు. భారీస్థాయిలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని చెప్పుకొచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిరుద్యోగులకు ఎక్కువగా ఉద్యోగాలు ఇవ్వలేదని మండిపడ్డారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని.. కానీ ఫలితం లేదని విమర్శించారు. అక్రమాలు జరుగకుండా గ్రూప్ వన్ ఉద్యోగాలు భర్తీ చేసే పాలకులు రాష్ట్రంలో లేరని ధ్వజమెత్తారు. గ్రూప్ వన్ కోసం ఎదురుచూస్తున్న అనేకమంది నిరుద్యోగుల ఏజ్ బార్ అయిపోయిందని బండి సంజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.

మేకార్తి దినపత్రిక

16- 09 -2025 మంగళవారం

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే







**మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ సిరిసిల్ల ప్రతినిధి**

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్. బి.గితే ఐపీఎస్. తెలిపారు.

ఈరోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 36 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు

# దళిత జర్నలిస్టుల పోరం రాష్ట్ర సభల పోస్టర్ విడుదల



**మేకార్తి దినపత్రిక సెప్టెంబర్**
**సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల నవజీవన్**

దళిత జర్నలిస్టులకు సామాజిక న్యాయం దక్కాలని అ విదంగా ప్రభుత్వాలు అండగా నిలవాలని ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. సోమవారం హైదరాబాద్ లోని మినిస్టర్స్ క్వార్టర్ లోని అయన ఛాంబర్లో దళిత జర్నలిస్టుల పోరం వ్యవస్థాపకులు కాశపోగు జాన్ తో కలిసి పోస్టర్స్ ను విడుదల చేశారు. ఈ నెల 19 న రవీంద్రభారతి లో జరిగే దళిత జర్నలిస్టుల పోరం 10 వ రాష్ట్ర మహాసభకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. తప్పకుండ రాష్ట్ర సభకు హాజరువుతా అని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దళిత జర్నలిస్టులు మంచి వార్తలు రాయాలని సమాజానికి ప్రభుత్వానికి వారధిగా ఉండాలని పేర్కొన్నారు. మీ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత జర్నలిస్టుల పోరం రాష్ట్ర వర్కింగ్ కార్యదర్శి ధనుష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జగత్ ప్రకాష్, శివ కుమార్, పెద్ది గారి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.ఐ.ఆర్ నిర్వహణకు అధికారులు సన్నద్ధంగా ఉండాలి




**మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ సిరిసిల్ల ప్రతినిధి**

స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) నిర్వహణకు అధికారులు సన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ 2002 పై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈఓ సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఈ వీ.సి. లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లిరాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూలిఓటర్ జాబితాలో డూప్లికేట్ ఓట్లు, దొంగ ఓట్ల తొలగింపు కు 20 నుంచి 25 సంవత్సరాలకు ఒకసారి స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) చేయడం జరుగుతుందని, మన తెలంగాణ రాష్ట్రంలో 2002 లో ఎస్.ఐ.ఆర్ చేయడం జరిగిందని అన్నారు. ఎస్.ఐ.ఆర్ నిర్వహణ పై మాస్టర్ ట్రైయినర్ల ద్వారా బూత్ స్థాయి సిబ్బందికి సంపూర్ణ అవగాహన కల్పించాలని అన్నారు. బీహార్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఇటీవల ఎస్.ఐ.ఆర్ చేయడం జరిగిందని అన్నారు.

ఎస్.ఐ.ఆర్ నిర్వహణ కంటే ముందు ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో 2002 ఎస్.ఐ.ఆర్ డేటా ను 2025 ఎస్.ఎస్.ఆర్ డేటా తో కంపేర్ చేసుకోవాలని, ప్రతి బి.ఎల్.ఓ దగ్గర 2002 ఎస్.ఐ.ఆర్, 2025 ఎస్.ఎస్.ఆర్ హార్డ్ కాపీలు ఉండాలని, ఈ రెండు జాబితాలో కామన్ గా ఉన్న పేర్లు మినహాయించి 2002 తర్వాత ఓటరుగా నమోదైన వారి వివరాలను క్షేత్రస్థాయిలో మరోసారి ధృవీకరించాల్సి ఉంటుందని అన్నారు.

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో రిటర్నింగ్ అధికారి, ఏఈఆర్ఓ, డిప్యూటీ తహసిల్దారులు, బి.ఎల్.ఓ సూపర్వైజర్లతో రెగ్యులర్ గా సమావేశాలు నిర్వహించాలని, ప్రతిరోజు లక్ష్యాలను నిర్దేశించుకోని ఎస్.ఐ.ఆర్ చేపట్టేలా కార్యాచరణ తయారు చేయాలని అన్నారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జి నగేష్ వేములవాడ సిరిసిల్ల ఆర్డీవోలు రాధాబాయి వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వెరిటాస్ సైనిక్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి



**మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ సిద్దిపేట**
**జిల్లా బ్యూరో కర్రోల్ల నవజీవన్**

యూఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రజావాణిలో కలెక్టర్ హైమావతి కి వెరిటాస్ సైనిక్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి వినతిపత్రం అందజేయడం జరిగింది.

ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా కార్యదర్శి గుడికందుల రవి మాట్లాడుతూ ములుగు మండల కేంద్రంలో ఉన్న వెరిటాస్ సైనిక్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలనీ %ఖూఖీ×% సిద్దిపేట జిల్లా కార్యదర్శి గుడికందుల రవి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెరిటాస్ సైనిక్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి, అర్హత లేని టీచర్స్, చెడు వ్యసనాలు ఉన్న ఉపాధ్యాయులను తీసుకొని పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడే విధంగా యాజమాన్యం తోడ్పడుతుంది. విద్యార్థిని ఈ ఘటనపై యాజమాన్యానికి తెలియజేస్తే వారు విద్యార్థిని నీ బెదిరించడం సిగ్గుచేటు అన్నారు .విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించే గురువే అఘాయిత్యానికి పాల్పడడం ఉపాధ్యాయ వృత్తికే అవమానం అన్నారు. ఇలాంటి ఉపాధ్యాయ వృత్తికే మచ్చ తెచ్చే వ్యక్తిని కఠినంగా శిక్షించాలని అన్నారు, ఇంత జరుగుతున్నా కూడా మండల విద్యాధికారి కానీ, జిల్లా విద్యాధికారి కానీ స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ ఘటన వెనక ఉపాధ్యాయుడ ీతోపాటు ఉపాధ్యాయ బృందం, పాఠశాల యాజమాన్యం ఉందన్నారు, ఇంత నీచనికి వడగట్టిన వెరిటాస్ సైనిక్ స్కూల్ గుర్తింపు రద్దుచేసి, యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. లేనియెడల పెద్ద ఎత్తున కార్యక్రమం చేపడతామని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు హేమంత్, మణికంఠ,ఆకాష్ పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య హౌస్ అరెస్ట్?



మేకార్తి దినపత్రిక సెప్టెంబర్
ప్రతినిధి కర్రోల్ల నవజీవన్

వరంగల్ లో బిఆర్ఎస్ నేతల పై అక్రమ అరెస్టులు నిర్బంధాలు కొనసాగుతున్నట్లు తెలుస్తుంది, బిఆర్ ఎస్ నేత మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యను సోమవారం ఉదయం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. మగాడివైతే ఎమ్మెల్యే పదవికి రాజీనా మా చేయాలని కడియం శ్రీహరి పై ఆదివారం మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య చేసిన వ్యాఖ్యలు స్టేషన్ ఘన్‌పూర్ నియోజక వర్గంలో సెగలు పుట్టిస్తున్నా యి.

మరోవైపు బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు పరస్పరం మాటల యుద్ధానికి దిగుతున్నారు. ఈ క్రమంలోనే ఇవాళ రఘునాథపల్లి మండలంలో పర్యటనకు సిద్ధమైన తాటికొండ రాజయ్యను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. తీవ్ర ఉద్రిక్తతల వేళ అక్కడి వెళ్లడం మంచిది కాదని వారు సూచించారు. వారించినా.. వినకపోడంతో పోలీసులు రాజయ్యను గృహ నిర్బంధం చేశారు.

దీంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ఆందోళనకు దిగగా టెన్షన్ వాతావరణం నెలకొంది. కాగా, మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. కడియం శ్రీహరికి సిగ్గు శరం ఉంటే.. వరంగల్ గడ్డ పౌరుషం ఉంటే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# పెన్షన్ దారులతో సిద్దిపేట అర్బన్ ఎమ్మార్వో కార్యాలయం ముట్టడి



**మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ 15**
**సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల నవజీవన్**

పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాలలోనీ మండల కేంద్రాలను ముట్టడించాలని పిలుపుమేరకు సిద్దిపేట అర్బన్ మండలంలో పెన్షన్ దారులైన వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళ, బీడీ, గీత, చేనేత, దారులతో పెద్ద ఎత్తున ముట్టడించి సిద్దిపేట అర్బన్ ఎమ్మార్వో కి పెన్షన్లను పెంచాలని వినతి పత్రము ఇవ్వడం జరిగింది.

ఈ కార్యక్రమంలో మంద కుమార్ మాదిగ సిద్దిపేట జిల్లా ఇన్చార్జి చుంచు రమేష్ మాదిగ సిద్దిపేట అధికార ప్రతినిధి ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడడం జరిగింది .సీఎం రేవంత్ రెడ్డి ఎలక్షన్ల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మరియు పేద బడుగు బలహీన వర్గాలకు వచ్చే పెన్షన్ పెంచాలని లేనిపక్షంలో సీఎం పదవి నుండి వైదొలగాలని మీడియా రూపకంగా తెలియజేస్తూ ఈనెల 20 తారీకున గ్రామాల్లోని గ్రామపంచాయతీల వద్ద నిరసన కార్యక్రమం ఉంటుందని తర్వాత నెల రోజులపాటు రిలే నిరాహార దీక్షలు కూడా ఉంటాయని అప్పటికి సీఎం స్పందించకుంటే హైదరాబాదులో పెద్ద ఎత్తున మహా ధర్నాను నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెరిక ప్రశాంత్ మాదిగ మరియు గాడ్చెర్ పల్లె, బూరుగుపల్లె, పొన్నాల, లింగారెడ్డి పల్లె, తదితర వార్డు గ్రామాలు పాల్గొనడం జరిగింది.

# ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు



**మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ సిరిసిల్ల ప్రతినిధి**

ఇంజనీరింగ్ పితమహుడు సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదిన సందర్భంగా జిల్లాలోని ఇరిగేషన్, మిషన్ భగీరథ, పంచాయత్ రాజ్, రోడ్డు మరియు భవనాలు, మరియు గృహ నిర్మాణ (హౌజింగ్)

శాఖల నుండి అధికారులు, ఉద్యోగస్తులు పాల్గొని మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి ఘన నివాళులు అర్పించడం జరిగింది, ముఖ్య అథితులుగా పాల్గొన్న టీ.జి.ఓ సంఘ జిల్లా అధ్యక్షులు సమర సేన్, కార్యదర్శి సయ్యద్ జబి, టీ.ఎన్.జి.ఓ కార్యదర్శి సుదర్శనం పాల్గొన్నారు,

ఈ సందర్భంగా వచ్చిన అధికారులు నాయకులు మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారు దేశ నిర్మాణం కోసం చేసిన సేవలు, అయన నిర్మించిన కట్టడాలు, సాగునిటీ, తాగునిటీ తదితర ప్రాజెక్టుల నిర్మాణం, అయనకున్న పట్టుదల, నిజాయితీని ప్రపంచం గుర్తించిన మేధావి, భారత రత్న సాధించిన గొప్ప వ్యక్తిని స్మరించుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలని, ఇంజనీరింగ్ శాఖల అభివృద్ధిలొ ప్రతి ఒక్కరు తమవంతుగా కృషి చేయాలనీ తెలిపారు. ఈ కార్యక్రమంలొ వివిధ శాఖల నుండి అధికారులు %జుజు%,లు కిషోర్, జానకి మేడం, ముజహిద్ అన్వర్, సుదర్శన్ రెడ్డి, %ఐజుజు%లు రవికుమార్, శాంతయ్య, వరప్రసాద్, మరియు . వెంకట్ రెడ్డి, %దీ%.శ్రీకాంత్, %దీ%.సాగర్, తదితరులు పాల్గొన్నారు

# జాతీయం

## బాను ముస్తాక్‌కు ఆహ్వానంపై పిటిషన్లను తోసిపుచ్చిన హైకోర్టు



**బెంగళూరు ,మేకార్తి దినపత్రిక :**
చరిత్రాత్మక మైసూరు దసరా వేడుకలను ప్రారంభించడానికి బుకర్ ప్రైజ్ విజేత బాను ముస్తాక్‌ను ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కర్ణాటక హైకోర్టు సోమవారంనాడు తోసిపుచ్చింది. పార్లమెంటు మాజీ సభ్యుడు ప్రతాప్ సింహాతో సహా నాలుగు ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాలను విచారణకు స్వీకరించేందుకు ప్రధాన న్యాయమూర్తి విభు భక్రు, న్యాయమూర్తి సీఎం జోషితో కూడిన డివిజన్ బెంచ్ నిరాకరించింది.
రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమానికి వేరే మతవిశ్వాసాలు కలిగిన వ్యక్తిని ఆహ్వానించడం చట్ట ఉల్లంఘనగా కానీ, రాజ్యాంగపరమైన హక్కులను ఉల్లంఘించడంగా కానీ తాము భావించడం లేదని డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. పిటిషన్లను డిస్మిస్ చేస్తున్నట్టు ప్రకటించింది.
బాను ముస్తాక్ కొద్ది నెల క్రితం హిందూ వ్యతిరేక, కన్నడ వ్యతిరేక వ్యాఖ్యలు చేశారని పిటిషనర్లు వాదించారు. దసరా ప్రారంభోత్సవంలో చాముండేశ్వరి దేవత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించాలని, వేదాలను పఠించాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి బాను ముస్తాక్ తగిన వారు కాదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫు హాజరైన అడ్వకేట్ జనర్ కె.శశికిరణ్ షెట్టి తన వాదన వినిపిస్తూ, ఉత్సవాల ప్రారంభించే వ్యక్తిగా ఎవరిని ఆహ్వానించాలనే దానిపై ఏర్పాటు చేసిన కమిటీలో అన్ని పార్టీలకు చెందిన స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, తక్కిన భాగస్వాములంతా ఉన్నారని తెలిపారు. దసరా పండుగ రాష్ట్ర పండుగ అని, పిటిషన్లను డిస్మిస్ చేయాలని కోర్టును కోరారు.
సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకూ 11 రోజుల పాటు మైసూరులో దసరా ఉత్సవాలు జరుగనున్నాయి. తొలిరోజు ఆహ్వానితులతో పాటు ముఖ్యమంత్రి సిద్దరామయ్య, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, అధికారులు పాల్గొంటారు. చాముండేశ్వరిదేవికి పుష్పార్చన ద్వారా శ్రీకారం చుట్టే ఉత్సవాలలో ప్రతిరోజూ సాహిత్య, సాంస్కృతిక, నృత్య కళాప్రదర్శనలు ఉంటాయి. జంబూసవారి రోజున 750 కేజీల బంగారు అంబారిపై చాముండేశ్వరిదేవిని ప్రతిష్ఠించి ఊరేగిస్తారు. పూల ప్రదర్శన, వస్తు ప్రదర్శనతోపాటు మైసూరు నగరమంతటా ప్రత్యేకమైన విద్యుద్దీపాల అలంకరణలు ఉంటాయి. ఎయిర్‌షో, హెలిటూరిజం వంటి కార్యక్రమాలన్నీ ప్రభుత్వ పర్యవేక్షణలో కొనసాగుతాయి. మరోవైపు రాజసంప్రదాయంలో భాగంగా మైసూరుప్యాలెస్ లో యువరాజు యదువీర్ బంగారు సింహాసనంపై ఆశీనులై ప్రైవేట్ దర్బార్ నిర్వహిస్తారు. జంబూసవారి పూజ ప్యాలెస్‌లో ప్రత్యేకంగా జరుగుతుంది

## బెట్టింగ్ యాప్స్ కేసులో ఊర్వశి మిమికి నోటీసులు



**ఢిల్లీ ,మేకార్తి దినపత్రిక**
దేశంలో ఢిల్లీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఒక కీలక మనీ లాండరింగ్ కేసును దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో అక్రమ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ కీలకంగా మారాయి. ఈ బెట్టింగ్ యాప్స్ సోషల్ మీడియా, యాప్ స్టోర్లు, ఇతర ప్లాట్‌ఫామ్‌లలో తప్పుడు ప్రకటనల ద్వారా నడిచేవి. ఇప్పుడు ఈ కేసులో సినీ నటి మిమి చక్రవర్తి, బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలాకు ఈడీ సమన్లు జారీ చేసింది.

సమన్లు ఎందుకు?

ఈడీ అధికారులు చెప్పినట్లు ఈ ఇద్దరు ప్రముఖులు కొన్ని అక్రమ బెట్టింగ్ యాప్స్‌కు ప్రమోషన్లు చేశారని అనుమానం ఉంది. ఈ నేపథ్యంలో వీరు వాటికి సంబంధించిన ప్రకటనల్లో పాల్గొన్నారా? పాల్గొంటే ఎలాంటి ఫీజులు తీసుకున్నారనే దానిపై ఈడీ విచారణ చేస్తోంది. గతంలో ఈ కేసులో మాజీ క్రికెటర్లు శిఖర్ ధావన్, సురేష్ రైనా కూడా విచారణకు హాజరయ్యారు. వారి నుంచి ఈడీ కీలక సమాచారం సేకరించింది.

బెట్టింగ్ యాప్స్ ఎలా పనిచేస్తున్నాయంటే...

ఈ యాప్స్ ప్రస్తుతం నిషేధించబడిన జాబితాలో చేర్చబడ్డాయి. కానీ గతంలో సామాన్య ప్రజలకు ఆకర్షణీయమైన స్కీమ్స్ చూపించి, డబ్బులు వసూలు చేశారు. తర్వాత ఆ డబ్బును విదేశాలకు తరలిస్తూ మనీ లాండరింగ్ చేసినట్లు తెలుస్తోంది. ఇలాంటి యాప్స్‌కు సోషల్ మీడియా, యూట్యూబ్, ఇతర వెబ్‌సైట్‌లు ప్రకటనల రూపంలో సహకరించాయి. గతంలో గూగుల్, మెటా (ఫేస్‌బుక్ మాతృ సంస్థ) ప్రతినిధులను కూడా ఈడీ విచారించింది.

బెట్టింగ్ మార్కెట్ విలువ

ఇప్పటివరకు 220 మిలియన్ల మంది భారతీయులు అక్రమ బెట్టింగ్ యాప్స్ వినియోగించారు. వారిలో 110 మిలియన్లు రెగ్యులర్ యూజర్లు. 2025 మొదటి మూడు నెలల్లోనే 1.6 బిలియన్ విజిట్స్ ఈ యాప్స్‌కి వచ్చాయి. భారతదేశంలో ఈ మార్కెట్ విలువ %వి%100 మిలియన్ అని అంచనా. ఈ క్రమంలో ప్రతి ఏడాది సుమారు రూ.27,000 కోట్లు పన్ను ఎగ్గొట్టుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం చర్యలు

దీంతో అప్రమత్తమైన కేంద్రం 2022 నుంచి జూన్ 2025 వరకు 1,524 బెట్టింగ్ వెబ్‌సైట్‌లు, యాప్స్‌ను బ్లాక్ చేసింది. అయినప్పటికీ, కొత్త పేర్లతో కొత్త యాప్స్ వస్తూనే ఉన్నాయి. సినిమా, క్రీడా రంగాల ప్రముఖులు వారికీ ఉన్న ఫాలోయింగ్‌ను వినియోగించుకుని ప్రచారం చేసుకుంటున్నాయి. ఈడీ ఇప్పటికీ ఈ కేసులో కొత్త ఆధారాలు సేకరిస్తోంది. కొత్తగా మరిన్ని ప్రముఖుల పేర్లు బయటకు వచ్చే ఛాన్సుంది.

## అందుకే పెద్దాయన అప్లికేషన్ తీసుకోలేదు



త్రిసూర్, **మేకార్తి దినపత్రిక**
తనకు ఇల్లు కావాలంటూ ఇటీవల ఒక పెద్దాయన ఇచ్చిన అప్లికేషన్‌ను కేంద్ర మంత్రి సురేష్ గోపి తిరస్కరించడంపై నెటిజన్ల నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. దీనిపై కేంద్ర మంత్రి తాజాగా స్పందించారు. ఎలాంటి పనులు చేయగలను, ఎలాంటివి చేయలేననే విషయంలో తనకంటూ ఒక స్పష్టత ఉందని చెప్పారు. చేయలేని పనుల విషయంలో హామీలు ఇవ్వలేనని అన్నారు.
త్రిసూర్‌లో ఈనెల 12 జరిగిన ఒక కార్యక్రమంలో వేలాయుధన్ అనే పెద్దాయన సురేష్ గోపి వద్దకు వచ్చి తనకు ఇల్లు మంజూరయ్యేలా సాయం చేయాలని కోరారు. ఇందుకు సంబంధించి ఒక అప్లికేషన్ ఇవ్వబోయారు. అయితే దానిని తీసుకునేందుకు సురేష్ గోపి నిరాకరించారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో రావడంతో ఆయనపై విమర్శలు వ్యక్తమయ్యాయి. దీనిపై మంత్రి తన ఫేస్‌బుక్ పేజీలో వివరణ ఇచ్చారు. కొందరు ఈ విషయాన్ని తమ స్వప్రయోజనాల కోసం వాడుకోవాలని చూస్తున్నారని తప్పుపట్టారు. ఒక ప్రజాప్రతినిధిగా తాను ఏమి చేయగలనో, ఏమి చేయలేననే విషయాల్లో తనకు చాలా స్పష్టత ఉందని చెప్పారు. సాధ్యంకాని హామీలు తాను ఇవ్వలేనని అన్నారు. ఎవరికీ ఆశలు కల్పించలేనని చెప్పారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన అంశాలు రాష్ట్ర పరిధిలోకి వస్తాయని, దానిపై నిర్ణయం తీసుకోవాల్సింది రాష్ట్ర ప్రభుత్వాలేనని చెప్పారు.
కాగా, వృద్ధుడికి ఇల్లు ఇప్పిస్తామని మరో రాజకీయ పార్టీ ముందుకు వచ్చింది. దీనిపై సురేష్ గోపి స్పందిస్తూ, అది కూడా మంచిదేనని, దీని వెనుక ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు ఉన్నా వారికి సొంత ఇల్లు ఇవ్వడం ముఖ్యమని అన్నారు. ప్రజలు పడే ఇబ్బందుల విషయంలో రాజకీయ గేమ్స్‌కు తావులేదని ఆయన మరోమారు స్పష్టం చేశారు.

## వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై సుప్రీంకోర్టు మధ్యంతర తీర్పు



**మేకార్తి దినపత్రిక**
వక్ఫ్ చట్ట సవరణ 2025పై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఇప్పుడు తాజాగా ఈ చట్టంలోని కొన్ని కీలక సెక్షన్లపై సుప్రీంకోర్టు మధ్యంతరంగా స్టే విధించింది.
వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై సుప్రీంకోర్టు మధ్యంతర తీర్పు వక్ఫ్ చట్ట సవరణ 2025 ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చకు దారితీస్తోంది. మతపరమైన ఆస్తుల పరిరక్షణ పేరుతో చేసిన ఈ సవరణలు ఇప్పుడు రాజ్యాంగబద్ధతపైనే సందేహాలు రేపుతున్నాయి. తాజాగా, ఈ చట్టంలోని కొన్ని కీలక సెక్షన్లపై సుప్రీంకోర్టు మధ్యంతరంగా స్టే విధించింది. పలు రాష్ట్రాల నుంచి దాఖలైన పిటిషన్లలో, సవరణలు మౌలిక హక్కులకు విరుద్ధమని, ప్రజాస్వామ్యానికి భంగం కలిగిస్తున్నాయని ఆరోపణలు వచ్చాయి.
వివాదాస్పద సెక్షన్లపై..
సుప్రీంకోర్టు వక్ఫ్ సవరణ చట్టం 2025లోని కొన్ని నిబంధనల అమలును తాత్కాలికంగా నిలిపివేసింది. చట్టం మొత్తం చెల్లుబాటు అవుతుందని, కానీ కొన్ని వివాదాస్పద సెక్షన్లపై స్టే విధించినట్లు సీజేఐ బీఆర్ గవాయ్ తెలిపారు.
నిలిపివేయబడిన నిబంధనలు:
సెక్షన్ 3: ఆస్తిని వక్ఫ్‌కు దానం చేయాలంటే కనీసం 5 సంవత్సరాలు ఇస్లాం ఆచరించి ఉండాలన్న నిబంధన నిలిపివేయబడింది. ఎందుకంటే, దీన్ని అమలు చేయడానికి సరైన నియమాలు లేకపోతే అధికార దుర్వినియోగం జరిగే అవకాశం ఉంది.
సెక్షన్ 2: నియమిత అధికారి నివేదిక ఇచ్చే వరకు ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా పరిగణించరాదన్న నిబంధన నిలిపివేయబడింది. ఎందుకంటే, ఆస్తి హక్కులపై కార్యనిర్వాహక అధికారి తీర్పు ఇవ్వలేరు.
సెక్షన్ 3: రెవెన్యూ రికార్డుల్లో మార్పులు చేసే అధికారం కలెక్టర్‌కు ఇవ్వడం అధికార విభజనకు వ్యతిరేకం. అధికారుల తుది నివేదిక వచ్చే వరకు ఆస్తి హక్కులు ప్రభావితం కావు.
ఇతర ముఖ్య నిబంధనలు:
వక్ఫ్ బోర్డులో నలుగురి కంటే ఎక్కువ మంది ముస్లిం కాని సభ్యులు ఉండకూడదు. రాష్ట్ర స్థాయిలో ముగ్గురి కంటే ఎక్కువ ఉండరాదు.
వక్ఫ్ బోర్డు ఎక్స్-ఆఫీసియో అధికారి ముస్లిం సమాజానికి చెందినవారై ఉండాలి.
వక్ఫ్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ముస్లిం సమాజానికి చెందినవారై ఉండాలని సుప్రీంకోర్టు సూచించింది. ముస్లిం కాని వ్యక్తినిగా నియమించే సవరణను మాత్రం నిలిపివేయలేదు.
తుది తీర్పు వచ్చే వరకు వక్ఫ్ ఆస్తుల హక్కులు, స్వాధీనం ప్రభావితం కావు.
సుప్రీంకోర్టు వ్యాఖ్యలు:
1923 నుంచి వక్ఫ్ చట్టాల చరిత్రను పరిశీలించామని, మొత్తం చట్టాన్ని నిలిపివేయడానికి తగిన ఆధారాలు లేవని సీజేఐ బీఆర్ గవాయ్ తెలిపారు. చట్టం రాజ్యాంగబద్ధమనే అనుమానాన్ని ఎల్లప్పుడూ ముందు ఉంచుతామని, అత్యంత అరుదైన సందర్భాల్లోనే అమలును నిలిపివేస్తామని వెల్లడించారు.
మొత్తానికి వక్ఫ్ సవరణ చట్టం 2025 మొత్తం చెల్లుబాటు అవుతుంది. కానీ సెక్షన్ 3 వంటి వివాదాస్పద నిబంధనలు రాష్ట్ర ప్రభుత్వాలు తగిన నియమాలు రూపొందించే వరకు అమలులో ఉండవు.

## మళ్లీ ఎన్‌కౌంటర్ మరో అగ్రనేత హతం



**,మేకార్తి దినపత్రిక** రాయ్‌పూర్, సెప్టెంబర్:
ఛత్తీస్‌గఢ్ హజారిబాగ్ జిల్లాలోని అటవీ ప్రాంతంలో సోమవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మరణించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేతల్లో ఒకరు సహదేవ్ సోరెన్ హతమయ్యారు. అతడి తలపై రూ. కోటి రివార్డు ఉందని భద్రతా దళాలు ఈ సందర్భంగా వెల్లడించాయి. గోర్హర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పండిత్రి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నట్లు భద్రతా దళాలకు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో భద్రతా దళాలు ఆ ప్రాంతానికి చేరుకుని కూంబింగ్ చేపట్టాయి. ఈ విషయాన్ని మావోయిస్టులు పసిగట్టి.. భద్రతా దళాలపైకి కాల్పులకు తెగబడ్డారు.
దీంతో భద్రతా దళాలు వెంటనే స్పందించి.. ఎదురు కాల్పులకు దిగాయి. ఈ నేపథ్యంలో ఇరు వైపులా హోరాహోరీగా కాల్పులు జరిగాయి. అయితే ఈ కాల్పులు ఇంకా కొనసాగుతున్నాయని భద్రతా దళాలు తెలిపాయి. 2026, మార్చి మాసాంతానికి దేశంలో మావోయిస్టులు నిర్మూలించడమే లక్ష్యంగా కేంద్రం పక్క ప్రణాళికతో ఒక వ్యూహాన్ని అమలు చేస్తోంది. అందులో భాగంగా ఆపరేషన్ కగార్‌ను చేపట్టింది.
ఈ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టులపై ఉక్కు పాదంతో అణిచివేసేందుకు భద్రతా దళాలు తమ కూబింగ్‌ను తీవ్ర తరం చేశాయి. దీంతో సదరు రాష్ట్రంలో వరుస ఎన్‌కౌంటర్లు చోటు చేసుకున్నాయి. ఆ క్రమంలో ఇప్పటి వరకు వందలాది మంది మావోయిస్టులు మరణించారు. పలువురు పోలీసుల ఎదుట లొంగిపోయారు. అలాగే భారీగా మావోయిస్టులు అరెస్టయ్యారు. ఇంకోవైపు దండాకారణ్యంలోని అధిక ప్రాంతం.. ఇప్పటికే భద్రతా దళాలు తమ అధీనంలోకి తెచ్చుకున్నాయి. అదీకాక పలువురు మావోయిస్టు అగ్రనేతలు సైతం వివిధ ఎన్‌కౌంటర్లలో హతమయ్యారు. ఇక కేంద్రం ఇంతటి ప్రణాళికతో ముందుకు వెళ్తున్నా.. మావోయిస్టులు మాత్రం వెనక్కి తగ్గడం లేదు. తాజాగా మావోయిస్టు పార్టీ కార్యదర్శిగా తెలంగాణకు చెందిన తిరుపతిని నియమించిన విషయం విదితమే.

# అంతర్జాతీయం

## కార్పొరేట్ సంస్థలు విదేశీ వర్కర్లను అమెరికాకు తీసుకురావచ్చు



**ఇంటర్నెట్ డెస్క్:**
అమెరికాలో ఉద్యోగాలు అమెరికన్లకే ఇవ్వాలంటూ చెబుతున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా వెనక్కు తగ్గారు. విదేశీ ఉద్యోగులను కూడా నియమించుకోవచ్చని సోషల్ మీడియాలో కామెంట్ చేశారు. ఇది అమెరికన్లకు ఉపకరిస్తుందని కూడా అన్నారు. అమెరికాలో పెట్టుబడులపై దక్షిణ కొరియా వార్నింగ్‌తో వెనక్కు తగ్గిన ట్రంప్ చేతుల కాలక ముందే రూటు మార్చి దిద్దుబాటు చర్యలకు దిగారు అసలేం జరిగిందంటే..
వలసలపై ఉక్కుపాదం మోపుతున్న ట్రంప్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా అక్రమ వలసదారులను గుర్తించేందుకు రెయిడ్స్ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా జార్జియా రాష్ట్రంలోని హ్యుందాయ్ ప్లాంట్‌లో సుమారు 475 మంది అక్రమ వలసదారులు హ్యామ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం అధికారులకు చిక్కారు. ప్లాంట్‌లో దక్షిణ కొరియాకు చెందిన వారు అక్రమంగా పని చేస్తున్నారన్న సమాచారంతో వెళ్లిన అధికారులు అనేక మంది దక్షిణ కొరియన్లను అదుపులోకి తీసుకున్నారు. దీంతో, ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు చెలరేగాయి
దక్షిణ కొరియా అసంతృప్తి
ఈ ఉదంతంపై దక్షిణ కొరియా అధ్యక్షుడు నేరుగా స్పందించారు. 'ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మా వ్యాపార సంస్థలు యూఎస్‌లో పెట్టుబడులు పెట్టడానికి వెనకాడుతున్నాయి' అంటూ తేల్చి చెప్పారు (%ఎబఅఖఅ ఖీఅఎ ఖశ్రీశ్రీశీ%). సాంకేతికంగా, ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న దక్షిణ కొరియా ఇలా తీవ్ర స్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేయడంతో ట్రంప్ వెంటనే వెనక్కు తగ్గారు. విదేశీ సంస్థలు ఇతర దేశాల వర్కర్లను అమెరికాకు తెచ్చుకోవచ్చని అన్నారు.
'విదేశీ కంపెనీలు భారీ పెట్టుబడులతో అమెరికాలో పెద్ద ప్లాంట్లు, యంత్రాలు ఏర్పాటు చేస్తున్నప్పుడు ఇతరత్రా కొన్ని అమెరికా బాటపడతాయి. విదేశీ కంపెనీలు ఇలా ఫారిన్ వర్కర్లను కూడా అమెరికాకు తెచ్చుకోవచ్చు. లేకపోతే.. అమెరికాలోని భారీ స్థాయిలో పెట్టుబడులు రావు. చిప్స్, సెమీ కండక్టర్స్, కంప్యూటర్స్, షిప్పులు, రైళ్లు, ఇలా అనేక రంగాల్లో తయారీకి సంబంధించి ఇతరుల నుంచి అమెరికన్లు మెళకువలు నేర్చుకోవాల్సి ఉంటుంది. కాబట్టి కొంత కాలం పాటు ఫారిన్ సంస్థలు విదేశీ వర్కర్లను అమెరికాలో నియమించుకోవచ్చు' అని ముక్తాయించారు

## భారత్‌తో మా బంధాన్ని తెంచేందుకు చేసే ప్రయత్నాలన్నీ విఫలమవుతాయని రష్యా విదేశాంగ శాఖ



**ఇంటర్నెట్ డెస్క్: మేకార్తి దినపత్రిక**
భారత్‌తో తమ బంధం కాలపరీక్షకు నిలిచినదని రష్యా విదేశాంగశాఖ తాజాగా పేర్కొంది. ఈ బంధాన్ని తెంచేందుకు చేసే ప్రయత్నాలన్నీ అంతిమంగా విఫలమవుతాయని హెచ్చరించింది. రష్యా చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్ సహా ఇతర రష్యా మిత్ర దేశాలపై యూరప్, నాటో దేశాలు సుంకాలు విధించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రష్యా విదేశాంగ శాఖ ఈ కామెంట్స్ చేసింది. భారత్, రష్యాల బంధం స్థిరమైన రీతిలో పురోగమిస్తోందని వ్యాఖ్యానించింది
మెరికా, నాటో దేశాల నుంచి వస్తున్న ఒత్తిడికి ఎదురొడ్డి నిలుస్తున్న భారత్‌పై రష్యా ప్రశంసల వర్షం కురిపించింది. బెదిరింపులకు లొంగకుండా ఇచ్చిన మాటకు కట్టుబడి భారత్ ఉందంటూ పొగడ్తల్లో ముంచెత్తింది. రష్యాతో దీర్ఘకాలిక బంధం, అంతర్జాతీయ వ్యవహారాల్లో వ్యూహాత్మక స్వేచ్ఛకు అనుగుణంగా భారత్ చర్యలు ఉన్నాయని రష్యా విదేశాంగ శాఖ అధికారులు పేర్కొన్నారు. జాతీయ ప్రయోజనాలు, సార్వభౌమత్వానికి భారత్-రష్యా భాగస్వామ్యం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు
ఇరు దేశాల మధ్య రవాణా సౌకర్యాలు పెంచేందుకు, జాతీయ కరెన్సీల్లో చెల్లింపులకు, కొత్త పేమెంట్ విధానాల అభివృద్ధికి రెండు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని రష్యా విదేశాంగ శాఖ అధికారులు పేర్కొన్నారు. పౌర, మిలిటరీ రంగాలకు చెందిన అనేక ప్రాజెక్టులను భారత్ రష్యా ఇప్పటికే కలిసి నిర్వహిస్తున్నాయి. అంతరిక్ష రంగం, అణుశక్తిలో కూడా కలిసికట్టుగా పనిచేస్తున్నాయి
భారత్‌పై అమెరికా 50 శాతం సుంకం విధించిన విషయం తెలిసిందే. రష్యా చమురు కొనుగోలు చేస్తున్న ఇతర దేశాలపై సుంకాలు మరింత పెంచాలని కూడా ట్రంప్.. జీ7, నాటో దేశాలపై ఒత్తిడి తెస్తున్నారు. చైనాపై 100 శాతం సుంకాలు విధించాలని కూడా డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే భారత్-అమెరికా మధ్య వాణిజ్య డీల్ కుదిరేందుకు తెర వెనుక ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. త్వరలో ఒప్పందం కుదరచ్చని విశ్లేషకులు కామెంట్ చేస్తున్నారు.

## భారతీయుడి హత్యపై ట్రంప్ ఆగ్రహం

అమెరికా **,మేకార్తి దినపత్రిక**
అమెరికా డాల్లాస్‌లో ఇటీవల ఓభారతీయుడు చంద్ర నాగమల్లయ్య దారుణహత్య ఘటన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ) తన సోషల్ ప్లాట్‌ఫామ్ ట్రూత్ వేదికగా తీవ్రంగా స్పందించారు. చంద్ర నాగమల్లయ్య ఒక గౌరవనీయ వ్యక్తి. అతన్ని ఒక అక్రమ వలసదారుడు, క్యూబా నుంచి వచ్చిన వ్యక్తి దారుణంగా హత్య చేశాడు. ఇలాంటి వ్యక్తి మన దేశంలో ఉండకూడదని అన్నారు.
ఈ ఘటన సెప్టెంబర్ 10న డల్లాస్‌లోని ఒక మోటల్లో జరిగింది. 41 ఏళ్ల నాగమల్లయ్యను 37 ఏళ్ల మార్టినెజ్ అనే వ్యక్తి హత్య చేసినట్టు పోలీసులు తెలిపారు. అతనిపై క్యాపిటల్ మర్డర్ అనే తీవ్ర నేరం కింద కేసు నమోదైంది. మార్టినెజ్, నాగమల్లయ్య తల నరికి, దాన్ని చెత్త బుట్టలో పడేశాడని పోలీసులు చెబుతున్నారు. ఈ ఘటన చంద్ర భార్య, కొడుకు ఎదురుగానే జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యాయి. మార్టినెజ్ అనే వ్యక్తి గతంలో చిన్నారులపై లైంగిక దాడి, కారు చోరీ వంటి అనేక నేరాల్లో అరెస్టు అయ్యాడు. కానీ, బైడెన్ ప్రభుత్వం ఆయనను విడిచిపెట్టిందని ట్రంప్ ఆరోపించారు. ఎందుకంటే క్యూబా అతన్ని తిరిగి తీసుకోవడం తిరస్కరించిందన్నారు. ఇలాంటి అక్రమ వలసదారులకు మేము ఇకపై సడలింపు ఇవ్వబోమని స్పష్టం చేశారు. అమెరికాను మళ్లీ సురక్షితంగా చేస్తామని ట్రంప్ హామీ ఇచ్చారు. ఈ ఘటనపై అమెరికా హోంశాఖ కూడా స్పందించింది. ఇది పూర్తిగా నివారించదగిన హత్య. ఆ వ్యక్తిని అమెరికాలో విడిచిపెట్టడం పెద్ద తప్పిదమని %ఊనా% అసిస్టెంట్ సెక్రటరీ ట్రిషా మెక్లాఫ్లిన్ అన్నారు. మార్టినెజ్ గతంలో ఐసీఈ కస్టడీలో ఉన్నాడు. 2025 జనవరి 13న బైడెన్ పాలనలో ఓ పర్యవేక్షణ ఉత్తర్వు ద్వారా విడుదలయ్యాడు. అదే ఇప్పుడు విషాదానికి దారితీసిందని తెలిపింది.

# పంటల సాగుకు సరిపడా యూరియా నిలువలు



**రైతులు ఆందోళన చెందవద్దు**

**ఇంకా యూరియా సరఫరా అవుతుంది**

**గ్యాస్ స్టవ్ పైనే విద్యార్థులకు ఆహార పదార్థాలను సిద్ధం చేయాలి**

**విద్యాలయం ఆవరణ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలి**

**కలెక్టర్ సందీప్ కుమార్**

**మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ బోయినపల్లి ప్రతినిధి**

జిల్లాలో ఆయా పంటల సాగుకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెల్లడించారు. బోయినపల్లి మండలం కొదురుపాక లోని రైతు వేదికలో సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేస్తుండగా, కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టోకెన్ పద్ధతి, ఎరువుల పంపిణీ పరిశీలించారు.

అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. జిల్లాలో ఆయా పంటల సాగుకు అణుగుణంగా ఎప్పటికప్పుడు యూరియా స్టాక్ తెప్పిస్తున్నామని స్పష్టం చేశారు. యూరియా విషయమై రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు .వ్యవసాయ శాఖ అధికారులు అప్రమంతంగా ఉండాలని తమ మండలాలకు వచ్చే ఎరువులను రైతుల పంటల సాగు విస్తీర్ణానికి అనుగుణంగా ఎరువులు సరఫరా చేయాలని ఆదేశించారు.రైతులు తమకు అవసరమైన ఎరువులు మాత్రమే తీసుకెళ్లాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎరువులు పక్కదారి పట్టకుండా.. ఇతర అవసరాలకు వాడకుండా చూడాలని ఆదేశించారు. గ్యాస్ స్టవ్ పైనే వంటలు సిద్ధం చేయాలి

గ్యాస్ స్టవ్ పైనే విద్యార్థులకు ఆహార పదార్థాలను సిద్ధం చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వేములవాడ మండలం చింతల్ ఠాణా ఆర్%ఁ%ఆర్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో కలెక్టర్ సందీప్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పూర్తి చేసిన కిచెన్ షెడ్, విద్యాలయం ఆవరణను పరిశీలించారు. విద్యాలయం ఆవరణలో నీరు నిలవకుండా, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.ఈ పర్యటన లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, ఏడీఏలు, ఏవోలు, ఏఈవోలు,ఉపాధ్యాయులు పంచాయతీ సెక్రటరీ పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ నుంచే కేసీఆర్

## జైత్రయాత్ర మొదలవ్వాలి



**మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ ప్రతినిధి**

ౠవంత్ ప్రభుత్వ నిర్వాకంతో 13 లక్షల విద్యార్థుల భవిష్యత్తు అంధకారం. కాంగ్రెస్ నేతల కనుసన్నల్లోనే యూరియా బ్లాక్ మార్కెట్ రేవంత్ పాలనలో హైదరాబాద్‌లో పెరిగిన క్రైమ్ రేట్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్

రేవంత్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో 13 లక్షల పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వడానికి ఒక్క పైసా కూడా లేదని డిప్యూటీ సిఎం చెప్పడం కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమన్నారు. విద్యార్థుల ఫీజుల కోసం లేని డబ్బులు, కమీషన్లు, కాంట్రాక్టులకు మాత్రం ఎక్కడి నుంచి వస్తున్నాయో ప్రభుత్వం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో జరిగిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంగళరావు నగర్ డివిజన్ స్థాయి బూత్ కమిటీ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తాము 20 వేల కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బిల్లులను చెల్లించామన్నారు. 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు గత కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన మూడు వేల కోట్ల రూపాయలను కూడా చెల్లించామన్నారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం డబ్బులు లేవన్న సాకుతో పెండింగ్ బకాయిలను ఇవ్వడం లేదని విమర్శించారు. డబ్బులన్నీ ఉద్యోగుల జీతాలు, సంక్షేమ పథకాలకే ఖర్చవుతున్నాయి, రీయింబర్స్మెంట్‌కు ఒక్క పైసా కూడా లేదని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క చెప్పడం సిగ్గుచేటు అన్నారు. కాలేజీల బంద్‌ను ఆపి వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఇక రాష్ట్రంలో తీవ్రంగా ఉన్న యూరియా కొరత, సంక్షోభానికి కాంగ్రెస్ పార్టీనే ప్రధాన కారణమన్నారు కేటీఆర్. రైతుల కోసం కేటాయించిన యూరియాను కాంగ్రెస్ నాయకులే బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతున్నారని ఆరోపించారు. మిర్యాలగూడ కాంగ్రెస్ ఎమ్మెల్యే గన్‌మ్యాన్ ఒక లారీ లోడ్ యూరియాను ఎత్తుకుపోవడం రాష్ట్రంలో కాంగ్రెస్ నేతల దోపిడికి నిలువెత్తు నిదర్శనమన్నారు. ఒక గన్‌మ్యాన్ లారీ లోడ్ యూరియా ఎత్తుకుపోతే ఇక కాంగ్రెస్ నాయకులు, మంత్రులు ఎంత దోచుకుంటున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు.

గత ముఖ్యమంత్రులైన ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్ఆర్, రోశయ్యలు ప్రవేశపెట్టిన కొన్ని పథకాలను కేసీఆర్ కొనసాగించారని కేటీఆర్ గుర్తుచేశారు. అయితే కేసీఆర్ పేరు ఉందన్న ఏకైక కారణంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నో మంచి పథకాలను నిలిపివేసిందని ఆరోపించారు. కేసీఆర్ కిట్లు, బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫాలు అన్నింటినీ ఆపేశారని చెప్పారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండా కాంగ్రెస్ నాయకులు అందినకాడికి దోచుకుతింటున్నారని మండిపడ్డారు. అప్పులు చేయకుండా ఆదాయం పెంచి పాలన చేస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పుకున్న కాంగ్రెస్ నేతలు అధికారంలోకి వచ్చిన 24 నెలల్లో ఒక్క హామీ కూడా అమలు చేయలేకపోయారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి నిర్వాకంతో ఊర్లలో అత్తా, కోడళ్ల మధ్య కొత్త పంచాయతీలు మొదలైనయన్నారు.


హైదరాబాద్‌లో పట్టపగలే దోపిడీలు, అత్యాచారాలు జరుగుతున్నాయని, క్రైమ్ రేట్ విపరీతంగా పెరిగిందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలపై ప్రేమ ఉంటే వర్షాలతో ఇబ్బందులు పడుతున్న ప్రాంతాలకు మంత్రులు పోవాలి కాని ఉపఎన్నికల ప్రచారంలో తిరగొద్దన్నారు. కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావాలని తెలంగాణలోని ప్రతి ఒక్కరు కోరుకుంటున్నారన్న కేటీఆర్, గులాబీ జైత్రయాత్ర జూబ్లీహిల్స్ ఉపఎన్నికతోనే మొదలవ్వాలన్నారు. తెలంగాణ దివాలా తీసింది, ఎయిడ్స్ పేషెంట్, క్యాన్సర్ పేషెంట్ అంటూ రేవంత్ రెడ్డి రాష్ట్రం పరువు తీస్తున్నాడని కేటీఆర్ విమర్శించారు.

చివరి శ్వాస వరకు ప్రజాసేవలోనే ఉన్న మాగంటి గోపీనాథ్ సేవలను గుర్తు చేసుకున్న కేటీఆర్, తామంతా కార్యకర్తలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పీజేఆర్, కేసీఆర్ పోరాట స్ఫూర్తితో బీఆర్ఎస్ కార్యకర్తలు పనిచేయాలని కోరారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే తమ ఇంటిని కూల్చివేసేందుకు పర్మిషన్ ఇచ్చినట్టే అన్న విషయాన్ని ప్రజలకు తెలియచేయాలని కార్యకర్తలకు సూచించారు. జీవో నెంబర్ 58, 59 కింద లక్ష మందికి కేసీఆర్ పట్టాలిచ్చారని, కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం వేల మంది ఇళ్లను కూలగొట్టిందని కేటీఆర్ ఆరోపించారు.


ఆరు గ్యారెంటీలు ఇవ్వకుండా మోసం చేసినందుకు, ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వకుండా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను గోస పెడుతున్నందుకు, హైదరాబాద్‌ను ఆగం చేసినందుకు కాంగ్రెస్ పార్టీకి జూబ్లీహిల్స్ ప్రజలు బుద్ధి చెప్పాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్‌లో ఘన విజయం సాధించి మాగంటి గోపీనాథ్‌కు నివాళి అర్పించాలని కోరారు.

# అర్జీలు సకాలంలో పరిష్కరించాలి









**మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ సిరిసిల్ల ప్రతినిధి**

ప్రజావాణి కు వచ్చే అర్జీలు సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో ప్రజల నుంచి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 185 దరఖాస్తులు వచ్చాయి.

రెవెన్యూ 61, డీఆర్డీఏ కు 44, హౌసింగ్ శాఖకు 25, ఉపాధి కల్పన కార్యాలయం, ఎస్డీసీ కార్యాలయానికి 8 చొప్పున, విద్యా శాఖ, జిల్లా పంచాయతీ కార్యాలయానికి 6 చొప్పున, జిల్లా పౌర సరఫరాల అధికారికి 5, ఎస్పీ, జిల్లా లైబ్రరీ సెక్రటరీ, జిల్లా వైద్యాధి కారికి మూడు చొప్పున, మున్సిపల్ కమిషనర్ వేములవాడ, ఈడీఎంకు రెండు చొప్పున, జిల్లా సంక్షేమ అధికారి, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్ల, ఏడీ ఎస్ ఎల్ ఆర్, డీఐఈఓ, సీపీఓ, సెస్, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి, ఈఈ ఆర్ అండ్ బీ, ఎస్ఆర్ఆర్ టెంపుల్ ఈఓ వేములవాడకు ఒకటి చొప్పున వచ్చాయి.

ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, జెడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మాదిగల ఆత్మీయ సమ్మేళనం



**మేకార్తి దినపత్రిక వేములవాడ**

జిల్లా కేంద్రంలోని కే కన్వెన్షన్ లో మాదిగల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 16వ తేదిన మాదిగ సామాజిక వర్గానికి చెందిన తెలంగాణ రాష్ట్ర గౌరవ మంత్రి వర్యులు అడ్లూరి లక్ష్మణ్ మరియు గౌరవ శాసనసభ్యులకు నిర్వహించే ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వేములవాడ పట్టణంలోని మండల పరిషత్ ఆవరణంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడితూ రాజన్న సిరిసిల్ల జిల్లా మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రోజు మధ్యాహ్నం 12 గంటలకు అంబేద్కర్ విగ్రహం నుండి కే కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ వద్దకు ర్యాలీ నిర్వహించిన అనంతరం కే కన్వెన్షన్ లో మాదిగ సామాజిక వర్గానికి చెందిన తెలంగాణ రాష్ట్ర మంత్రి అట్లూరి లక్ష్మణ్ కు మరియు శాసనసభ్యులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు, ఈ సమ్మేళన కార్యక్రమన్ని విజయవంతం చేయవలసిన బాధ్యత రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మాదిగ రక్త బాంధవులందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్, బోయిన్పల్లి సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, కోర్ కమిటీ సభ్యులు బొడ్డు నారాయణ, జింక శ్రీధర్, గుడిసె మనోజ్ కుమార్, మల్లారం హరిష్, లక్కే దినాకర్, నేదురి రాజు తదితరులు పాల్గొన్నారు...

# సీనియర్ నాయకులు కర్ర శ్రీహరికి

## నివాళులు అర్పించిన చల్మెడ



**మేకార్తి దినపత్రిక సెప్టెంబర్**

బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ నాయకులు కర్ర శ్రీహరి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. సోమవారం కర్ర శ్రీహరి స్వగ్రామమైన శనిగరంకు బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు వెళ్ళి వారి మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసి నివాళులర్పించారు. వారి వెంట నాయకులు కల్వకుంట్ల ప్రమోద్ రావు, బుద్ధినేని నర్సింగరావు, పుల్లెల శ్రీధర్, తదితరులు ఉన్నారు...

# నూతన ఎమ్మార్వోకు సన్మానం

## చేసిన బిఆర్ఎస్ నాయకులు



**మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ ముస్తాబాద్**

ఎమ్మార్వో గా బాధ్యతలు స్వీకరించిన రామచందర్ సార్ మర్యాదపూర్వక కలిసి శాలువాతో సత్కరించిన ముస్తాబాద్ పట్టణ

బీ ఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎద్దండి నరసింహారెడ్డి, రామలక్ష్మణ పల్లె మాజీ సర్పంచ్ దమ్మ రవీందర్ రెడ్డి, పోతుగల్ ప్యాక్స్ డైరెక్టర్ కట్ట బాపురావు, మాజీ సర్పంచ్ కృష్ణ, మహేందర్ రెడ్డి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన బిఆర్ఎస్ పార్టీ

## జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య



**మేకార్తి దిన పత్రిక సెప్టెంబర్ సిరిసిల్ల ప్రతినిధి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు మాట్ల మధు తమ్ముని వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన రాజన్న సిరిసిల్ల జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తోట ఆగన్న గారు. మరియు బిఆర్ఎస్ పార్టీ తంగళ్ళపల్లి మండల అధ్యక్షులు గజబింకర్ రాజన్న, న్యాలకొండ రాఘవరెడ్డి, వడిగల రాజు, కోడి అంతయ్య, విజయేందర్ రెడ్డి, జక్కుల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

PRINTED,PUBLISHED & OWNED BY MEKARTHI SRINIVAS, Pri- ted at SUNDAY PRINTING PRESS, H.No. 3-4297, SARASWATHI COMPLEX,SVN COLONY GUNTUR,ANDHRA PRADESH-522006.& Published from H.No. 12-166, RAJIV NAGAR,MUSTABAD, RAJANNA SIRICILLA DISTRICT-505404 TELANAGNA,.
RNI No.TGTEL /25/A2356,Editor : MEKARTHI SRINIVAS, Cell: 9014726022.e-mail: MEKARTHI DINAPATRIKA@gmail.com